# శేషయ్యగారి కుక్కపిల్ల

ఆ రోజు ఆఫీసరు గారింట్లో భోజనాలు. పేటలో చాలామందిని పిలిచారు ఆఫీసరుగారి పేరు శేషయ్యగారు. ఆయన చాలామంచివాడు - యోగ్యుడు. ఆఫీసరనన్న అహంభావం ఏమాత్రంలేదు. అందుచేత ఆఫీసులో వారందరికీ ఆయనంటే అమితమైన గౌరవం. "ఆయనా! మహారాజు! చెయ్యెత్తి దండం పెట్టవచ్చు గదండీ!" అంటారు ఆయననుగురించి ఎవరిని అడిగినా. ఉద్యోగరీత్యా ఆయనకి వచ్చేజీతం రెండొందలమాట అటుంచి పైన సాలీనా అయిదువేల రూపాయల ఆదాయం వచ్చే భూవసతి కూడా ఉన్నది. శేషయ్యగారు తానింత తిని, నలుగురికి పెట్టేవాడే కాని కాసీఖర్చుకి, దమ్మిడీఖర్చుకి వెనుదీసే వాడుకాడు. అందుచేత శేషయ్యగారింట్లో భోజనాలనేసరికి అందరికీ చాలా సంతోషం కలిగింది. ఆ భోజనాన్ని తలచుకుంటూ చాలామంది గంతులు వెయ్యటం ఆరంభించారు.

పన్నెండు గంటలు కొట్టేవేళకి "విస్తళ్లు వేశారు, త్వరగా రండి" అని అందరికీ కబుర్లు వెళ్ళినాయి. వచ్చిన వారిని అందరినీ శేషయ్యగారు స్వయంగా పలకరించి, మర్యాద చేసి కూర్చోపెడుతున్నారు.

శేషయ్యగారికి పిల్లాజెల్లా లేరు. కాని పిల్లలకంటే ఎక్కువ ప్రేమతో పెంచుతున్న కుక్కపిల్ల మాత్రం ఒకటివున్నది. శేషయ్యగారిని విడిచి పెట్టకుండా ఆ కుక్కపిల్ల వెంటబడి తిరుగుతుంటుంది. దానిసంగతి అందరికీ తెలుసు. ఎవరైనా దానిని పొగిడితే, శేషయ్యగారు పరమానందం పొందేవాడు. "ఇదండీ! మనిషికి కూడా ఉండవండీ దీనితెలివితేటలు! మనమేం మాట్లాడినా తెలుసుకుంటుంది" అని అమాంతం దాన్ని ఎగరేసి ఒళ్లో కూర్చోబెట్టుకుని ముద్దుపెట్టుకొనేవాడు.

శేషయ్యగారు భోజనానికి వచ్చిన అతిథులని ఆహ్వానిస్తూ ఇంట్లోకిబయటికి తిరుగుతూఉంటే, కుక్కపిల్లకూడా ఆయన కాళ్లకు అడ్డంపడుతూ చెంగుచెంగున ఎగురుతూ, తోక ఆడించుకుంటూ తిరుగుతూనే ఉన్నది. విస్తళ్లువేసిన చోటకూడా మధ్యగా ఆ కుక్కపిల్ల తిరగటం చూసి కొందరికి లోపల లోపల కోపంవచ్చింది "భోజనాలు చేసేచోట కుక్కపిల్లదేనికి? ఎంత ముద్దయితేమాత్రం పదిమంది భోజనానికి వచ్చినప్పుడయినా కాస్త కట్టేయ కూడదాఏమి?" అని కొందరు గొణిగారు. కాని పైకి ఏమీ అనలేకపోయినారు.

వడ్డన ఆరంభమైంది. వచ్చినవారంతా సుష్టుగా భోంచేస్తున్నారు. శేషయ్యగారికి గారెలంటే మహా ఇష్టం. అందుచేతా గారెల వడ్డనకి స్వయంగా ఆయనేపూనుకున్నారు. "అయ్యో! ఇంకా రెండు గారెలు వేయించుకోండి. తింటే గారెలుతినాలి అన్నారు పెద్దలు. ఇదుగో మహారాజుగారి కోరగా ఉడికింది. చేతులు ముడుచుకున్నారేం? వద్దంటే ఎలా?" అని ఆయన బలవంతంగా పెడుతున్నారు. అప్పుడు కూడా ఆ కుక్కపిల్ల ఆయనని విడిచిపెట్టలేదు. ఆయన ముద్దుగా మధ్యమధ్య దానితో మాట్లాడుతూ ఒక గారె ముక్కలుచేసి అప్పుడే దానిముందు పడేశారు. ఆఫీసరుగారి ప్రీత్యర్థం ఒకరూ, ఇద్దరూ ఆ కుక్కపిల్లను పిలిచి ఎడమచేతితో దాన్ని దువ్వి "ఏం కుక్కపిల్లండీ! శేషయ్యగారూ? ఎక్కడ సంపాదించారో కాని భలే కుక్కపిల్లనుమండీ? చూశారా? పిలవగానే వచ్చింది" అని తెగ మెచ్చుకుంటూ తమవిస్తళ్లలోని గారెముక్కలు కూడా దానికి పెట్టడం మొదలెట్టారు. ఎలాగైతేనేం, అతిథులందరూ సుష్టుగా భోజనంచేసి ఒకరివెంటఒకరు త్రేపు త్రేపున త్రేపుతుంటూ లేచేవేళకి, కుక్కపిల్ల కూడా గారెలుకడుపునిండా ఆరగించింది. శేషయ్యగారిని, వారిఇంట్లో ఆ రోజుచేసిన వంటరుచిని మెచ్చుకుంటూ అందరూ దర్జాగా చేతులు కడుక్కుంటుంటే శేషయ్యగారు ఆకుక్కపిల్లని చంకన వేసుకొని ఆనందంతో

# శేషయ్యగారి కుక్కపిల్ల

వింటూనిలబడ్డారు. ఆ తరవాత శేషయ్యగారు వసారాలో జంపకానాలు పరిపించి "అందరూ తాంబూలాలు వేసుకుంటుండండి నేనిప్పుడే భోజనం చేసివస్తాను." అన్నారు. భోజనాలకు వచ్చిన వారిలో ఒకపెద్ద "అవశ్యం. మీరు పాపంచాలా శ్రమపడ్డారు. ముందు భోజనం చెయ్యండి. ఆ తరవాత మాట్లాడుకోవచ్చు అందరమూ అలా తాంబూలాలు వేసుకుంటూ కూర్చుంటాము" అన్నాడు

శేషయ్యగారు భోజనంచేస్తూ ఉండగానే కుక్కపిల్లకు కూడా తిండి పెట్టడం మామూలు. అయితే ఆ నాడు కుక్కపిల్ల కడుపునిండా గారెలు తినటంవలన, తిండికి రాకుండా ఇంట్లోనించి ఎక్కడికో వెళ్లిపోయింది శేషయ్యగారు గబగబభోజనం ముగించారు. అటు బయట వాళ్లందరూ కనిపెట్టకొని ఉన్నారన్న తొందరలో, గారెలే పదిసార్లువడ్డించుకొని తిని బయట పడ్డారు. అందరితోపాటు కూర్చుని ఇచ్చాపాటి ఆరభించారు.

అధికంగా భోజనం చేసినవాళ్లు ఆయాసంతో అవసోపాలు పడుతున్నారు. ఇలా ఎవరిఅవస్థవారు పడుతుండగా పొరుగింటి వాళ్ల అబ్బాయి అఫీసరుగారిదగ్గికి ఒక దుర్వార్త తెచ్చాడు.

శేషయ్యగారికుక్కపిల్ల అవతలి బజారులో ఒకప్రక్కన పొట్టఉబ్బి చచ్చిపడిఉన్నది ఈ మాటచెప్పగానే ఆయన కళ్లనీళ్లపర్యంత మైనాడు. ఆయనను ఎలా ఊర



గపచిప్! —ఫొటో: లంకసుదర్శనం, అవనిగడ్డ

డింబాలోతోచక, అందరూ తెల్లబోయినారు.

"ఇంతలో ఉన్నది ఏమయినా ఇప్పటిదాకా బాగానే ఉండెనే"

"ఇంతలో ఎందుకు చచ్చిపోయిందండీపాపం. నేను గారె ముక్కవేస్తే బాగానే తిన్నది ఇందాక."

ఇలా నలుగురూ నాలుగు ముక్కలుఅన్నారు ఈ మాటలన్నీ వింటే ఒకమూలకూర్చొని, భుక్తాయాసంతో బాధపడుతూ, బొజ్జ నిమురుకుంటున్న బట్టతల ఆయన ఒకచిన్న నిర్ణయానికి వచ్చారు. గారెలు తిన్నది, అందుచేత చచ్చిపోయింది అని. ఆమాట విని ప్రక్కనవున్న మల్లికన్న ఆయన గారెలు తింటేపొట్టపట్టి చచ్చిపోయిందా? గారెలు బాగానే ఉన్నాయే అయినా, ఎందుకో ఆగారెలు తిన్నప్పటినుంచి నాకూ గొంతు ఒకటే మండుతున్నది" అన్నాడు బట్టతలఆయన చప్పున లేచి గాభరాగాచూస్తూ "మీకూ మండుతున్నదా? నాకు పొట్టకూడా ఉబ్బుకొస్తున్నది. ఇదేం ఖర్మమండీ? అని వాపోయినాడు. కొద్దిసేపట్లో ప్రతిఒక్కరికి అనుమానం ఆరంభమైంది అంతాకలిసి గారెలో పప్పురుబ్బేటప్పుడో ఎప్పుడో ఏదో విషపదార్థం కలిసిఉంటుందని నిశ్చయానికి వచ్చారు. శేషయ్యగారు నిలువునా వణికిపోయినాడు ముచ్చెమటలు పోసినాయి ఇంతమందికి విషంపెట్టిన పాపం తనమీదికి వచ్చిందే అని నెత్తినోరుకొట్టుకున్నాడు వాళ్లందరిముందూ తల ఎత్తుకు నిలబడలేక పోయినాడు ఇంట్లోకివెళ్లి ఆగారెలు ఇంకెవ్వరూ తినకుండా కట్టుదిట్టంచేసి భార్యని పదిలిట్టి, వచ్చాడు. గబగబనౌకరుని పిలిచి, అవతలబజారులో ఉన్న డాక్టరుగారికోసం కబురుచేశాడు.

డాక్టరుగారు ఆదరాబాదరా పరుగెత్తుకువచ్చాడు. ఆయనకూడా భోజనానికి రావలసినవాడే అయితే ఎక్కడో ఒక అర్జంటుకేసు రావటంవలన రాకపోయినాడు. డాక్టరు వచ్చి అందరినీ పరీక్ష చేశాడు. ప్రాణాంతకమైన విషయమే మీ లేదని ధైర్యంచెప్పి నేను ఇంటికి వెళ్ళి మీ అందరికి మందుపంపుతాను తీసుకోండి." అని చెప్పాడు.

శేషయ్యగారికి అప్పటికీ భయం తగ్గలేదు. "డాక్టరుగారూ! మీరు మరోకలాగా అనుకోకపోతే కాస్త ఈపూట ఇక్కడే ఉండండి. మాకు ధైర్యంగా ఉంటుంది." అని బతిమిలాడాడు డాక్టరుగారు తప్పని సరి అయి అంగీకరించాడు ఇంటికివెళ్ళి ఇంతమందు తెచ్చి, తలాకాస్త పోశాడు

తరువాత శేషయ్యగారు కొంత తేరకొని "డాక్టరుగారూ! మరేమీ భయంలేదుగదా!" అని అడిగారు. ఆయన భయంలేదని హామీ ఇచ్చాడు అక్కడికీ అనుమానం తీరక "మరి మాకుక్కపిల్ల చచ్చిపోయిందేమండీ?" అని అడిగారు శేషయ్యగారు.

డాక్టరుగారు అదోక రకంగా మొహంపెట్టాడు ఏదో చెప్పబోయి తడబడ్డాడు "ఉన్నమాట చెప్పేస్తాను మీకుకోపం రాదు కదా!" అని అడిగారు శేషయ్యగారు "ఏమిటి? మరేంఫరవాలేదు: చెప్పండి" అన్నారు

"నేను ఇందాక అర్జంటుకేసొకటి చూడటానికి వెళ్లాను మీరు భోజనానికి పిలిచారు కదా! వీలయినంత తొందరగా ఇంటికి చేరుకుందామని సైకిలురిక్షా ఎక్కి వస్తున్నాను నా తొందరనుబట్టి వాడూ చాలా తొందరగా తొక్కుతున్నాడు. ఇంతలో మీ కుక్కపిల్ల అడ్డువచ్చి చక్రంక్రిందపడింది రిక్షా తప్పుకుందామని ఎక్కుకుతిప్పటంలో వెనుక చక్రంకూడా దాని మీదుగా పోయింది అందువలన అది చచ్చిపోయింది,"

శేషయ్యగారు కోపపడతారని డాక్టరు అనుకున్నాడు కాని ఆయన ఒకనిట్టూర్పు విడిచి "అమ్మయ్య" అన్నారు భోజనానికి వచ్చినవారు మొహాలు మొహాలు చూసుకుంటూ కిక్కురు మనకుండా వెళ్ళిపోయినారు. అయితే అందరికే ఒకేసారిగా గొంతు మండటం, పొట్టఉబ్బుకు రావటం, మొదలయిన లక్షణాలు వచ్చి ఎందుకు బాధపడ్డారో ఎవ్వరూ చెప్పలేక పోయినారు ★

---

"నాకేగనుక ఈ ఆసామీకి ఉన్నంతడబ్బు ఉంటేనా, ఇంత కంటె ఎక్కువ భాగ్యవంతుణ్ణి అయ్యేవాడిని."

"అది పొరపాటు. నువ్వు అంతే భాగ్యవంతుడివి అయ్యేవాడివి"

"పొరపాటేమీలేదు నా దగ్గర జేబులో ఇంకో రూపాయి ఉన్నది"